
పటాన్‌చెరు: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సంగారెడ్డి: జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ



సంగారెడ్డి: ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రూపేశ్

# వేడుకలా పదేండ్ల పండుగ

- ఊరూరా జాతీయ జెండాల ఆవిష్కరణ
- అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ
- ఆనాటి ఉద్యమ ఘట్టాలను నెమరువేసుకున్న ప్రజానీకం

*తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన ఉద్యమాల గురించి నెమరువేసుకున్నారు. పదేండ్ల తెలంగాణ మరింత అభివృద్ధి చెంది జాతికి దిక్సూచిగా నిలవాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 2*


గుమ్మడిదల: బొంతపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి


రామచంద్రాపురం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పక్కన కార్పొరేటర్ పుష్పానగేశ్


న్యాల్‌కల్: మల్గిలో జెండాకు వందనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు


కల్హేర్: జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ గుర్రపు సుశీల


కోహీర్: జాతీయ జెండా, గులాబీ జెండాను ఎగురవేసిన బీఆర్‌ఎస్ నేతలు


సంగారెడ్డి కలెక్టరేట్: ఐబీ వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్‌జీవో నాయకులు


హత్నూర: దౌల్తాబాద్‌లో ఉద్యమకారులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


రాయికోడ్: జాతీయ జెండను ఎగురవేస్తున్న ప్రత్యేక అధికారి జగదీశ్వర్


వట్‌పల్లి: ఉసిరికపల్లి పాఠశాలలో జెండా ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయుడు


బొల్లారం: ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ


కంది: బేగంపేట గ్రామంలో గులాబీ జెండాను ఎగరవేసిన బీఆర్‌ఎస్ నాయకులు


సదాశివపేట: జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్


నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ కార్యాలయం జెండా వందనం చేస్తున్న నాయకులు


జిన్నారం: జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ భిక్షపతి, ఉద్యోగులు

## పటిష్ట బందోబస్తు మధ్య కౌంటింగ్

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి**


రుద్రారంలో కౌంటింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్ చెరు, జూన్ 2: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఈవీఎంలను పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో భద్రపరిచిన విషయము విధితమే. గట్టి బందోబస్తు మధ్య ఈవీఎంలకు పోలీసులు, ప్రత్యేక దళాలు పహారా కాస్తున్నాయి. ఆదివారం ఏర్పాట్లను పరిశీలించేందుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్‌కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా ఈవీఎంలు పెట్టిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఆ తర్వాత జహీరాబాద్ ఎంపీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈనెల 4న మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాటులను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, కౌటింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ వద్ద పొరపాట్లు జరగకుండా ఎన్నికల అబ్జర్వర్లు చూస్తారని చెప్పారు.

## ఘనంగా మల్లన్న జాతర


అండూరులో మల్లన్నను దర్శించుకొని పూజలు చేస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం, జూన్ 2: అండూరు గ్రామంలో మల్లన్న జాతర ఆదివారం ఘనంగా జరిగింది. యాదవ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతరలో బండ్లు, బోనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జాతరకు ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ నాయకులతో కలిసి మల్లన్నను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్వతాలుయాదవ్, గ్రామ నాయకులు రాజగోపాల్‌రెడ్డి అతిథులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జాతరలు మన సంస్కృతిని చాటి చెబుతాయన్నారు. కార్యక్రమంలో గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి, సత్యనారాయణపంతులు, ఆది మల్లేశ్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోం

చౌటకూర్, జూన్ 2: గిరిజనులను జనాభా ప్రతిపాదికన విద్యా ఉద్యోగాల్లో అమలవుతున్న 10శాతం రిజర్వేషన్‌ను విచ్ఛిన్నం చేయడానికి కొంత మంది కుట్రలు చేస్తున్నారని, రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోమని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానికం గా విలేకరులతో మాట్లాడారు. గిరిజన సమాజాన్ని అణగదొక్కే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జాదావత్ రవీందర్, కార్బరి, రాములు నాయక్, సంతోష్, మొత్యానాయక్, వేగవత్ సుశీల్ నాయక్, ప్రకాశ్‌జాదవత్, సంతోష్ రామతర్, పాండు, విగ్నేశ్ పాల్గొన్నారు.

## గుమ్మడిదలలో దంచికొట్టిన వాన

గుమ్మడిదల, జూన్ 2: నైరుతి రుతు పవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రోహిణి కార్తెలో దంచికొట్టిన ఎండలతో విసుగుచెందిన ప్రజలకు ఈ వాన చల్లబరిచింది. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదలతోపాటు పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన రావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రైతులు వానకాలం పంటలకు సిద్ధమవుతున్నారు. యాసంగి సిజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంతో ఈ వాన నష్టాన్ని మిగిలుస్తుందని రైతులు వాపోతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

# పక్కనేశారు!

- డంప్‌యార్డు, దానికి కేటాయించిన స్థలం ఆక్రమణ
- పరిశ్రమ తీరుపై మంగంపేట గ్రామస్తుల ఆగ్రహం



డంప్‌యార్డుకు బోర్డు తగిలించి సెక్యూరిటీ కార్యాలయంగా వినియోగిస్తున్న పరిశ్రమ

జిన్నారం, జూన్ 2: ప్రజల అవసరాల నిమిత్తం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో డంప్‌యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలను నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటికి ఆధరణ కరువైంది. అయితే జిన్నారం మండలం మంగంపేట గ్రామంలో నిర్మించిన డంప్‌యార్డు పక్కనే ఉండడంతో ఓ పరిశ్రమ దౌర్జన్యంగా ఆక్రమించింది. అదే షెడ్డును తమ అవసరాల కోసం వినియోగిస్తున్నది. మంగంపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో డంప్‌యార్డు నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు 2019లో ఎకరం స్థలం పంచాయతీకి కేటాయించారు. ఈ స్థలంలో 2020లో ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద రూ.2 లక్షలతో డంప్‌యార్డును నిర్మించి పంచాయతీకి అప్పగించారు. ఇదే 55 సర్వే నంబర్‌లో టీఎస్‌ఐఐసీ ద్వారా స్థలం పొందిన ఓ పరిశ్రమ డంప్‌యార్డు కోసం కేటాయించిన ఎకరం స్థలాన్ని, డంప్‌యార్డును ఆక్రమించింది. డంప్‌యార్డు కోసం వేసిన శిలాఫలకాన్ని పది రోజుల క్రితం ధ్వంసం చేసింది. డంప్‌యార్డులో చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేసేందుకు నిర్మించిన గదులలాంటి నిర్మాణాలను కూల్చి సెక్యూరిటీ కార్యాలయంగా వినియోగిస్తున్నది.

### నక్షను సైతం ఆక్రమిస్తారట



మంగపేట శివారులో నిర్మించిన డంప్‌యార్డును, దానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకున్న పరిశ్రమ డంప్‌యార్డుకు ఆనుకొని ఉన్న నక్ష బాటను తమ ఆధీనంలోకి తీసుకుంటామని గ్రామస్తులకు పరిశ్రమ సిబ్బంది చెబుతున్నారు. డంప్‌యార్డు కోసం రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, డంప్‌యార్డును సెక్యూరిటీ కార్యాలయంగా వాడుకుంటున్న పరిశ్రమ యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డంప్‌యార్డును పరిశీలించేందకు వెళ్తే అక్కడి సెక్యూరిటీ ఎంపీవో, పంచాయతీ సెక్రటరీని అనుమతించ.కుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. డంప్‌యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని, డంప్‌యార్డును పరిశ్రమ ఆదీనంలో నుంచి విడిపించి గ్రామానికి ఇవ్వాలి. దీనిపై కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

*- సార నరేందర్, మంగంపేట*

**మండల సమావేశంలో చర్చించినా..!**

గ్రామస్తులు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. గత శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో డంప్‌యార్డు కూల్చివేత, ఆక్రమణపై అధికారులను సభ్యులు ప్రశ్నించారు. డంప్‌యార్డును కూల్చి పరిశ్రమ తమ ఆదీనంలోకి తీసుకోవడంపై రెవెన్యూ అధికారులు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణను ప్రశ్నించారు. పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. డంప్‌యార్డును పరిశీలించేందుకు వెళ్తే అక్కడ ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ తమను లోనికి అనుమంతించలేదని ఎంపీవో సంతోష్‌కుమార్ తెలిపారు. డంప్‌యార్డును తమ ఆదీనంలోకి తీసుకున్న పరిశ్రమ నక్షలో ఉన్న మంగంపేట-ఊట్ల గ్రామాల బాటను కూడా తమ ఆదీనంలోకి తీసుకునేందుకు సిద్ధం అవుతున్నదని మంగంపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## జొన్నల కొనుగోలులో నిర్లక్ష్యం తగదు


వట్‌పల్లి: దేవునూర్‌లో అధికారులుతో మాట్లాడుతున్న ఆర్డీవో పాండు

వట్‌పల్లి, జూన్ 2: జొన్నల కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్డీవో పాండు అధికారులపై మండిపడ్డారు. మండల పరిధిలోని దేవునూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆదేశానుసారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జొన్నల కొనుగోలులో జాప్యం వహిస్తున్నారని నిర్వాహకులను హెచ్చరించారు. రైతుల పట్ల నిర్లక్ష్యం సరికాదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వడ్లు, జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రాల వద్ద రైతులతో దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. కొనుగోళ్లు ముగిసినా తర్వాత వచ్చిన రైతుల నుంచి కూడా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో మహేశ్‌చౌహాన్, డిప్యూటీ తహసీల్దార్ శంబిరెడ్డి, ఏఈవో పరిమళ, ప్యాక్స్ సీఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

**నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి**

అందోల్, జూన్ 2: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఆర్డీవో పాండు ఫర్టిలైజర్ దుకాణాదారులను ఆదేశించారు. మండల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వంచే గుర్తింపు పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలన్నారు. కొన్న తర్వాత రసీదు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. రైతులకు అమ్మిన విత్తనాలు నకిలీవి అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ అరుణ, ఎస్సై అరుణ్ కుమార్‌గౌడ్, ఏఈవోలు ఉన్నారు.

## సస్యరక్షణతో మేలైన దిగుబడులు


మెటల్‌కుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

న్యాల్‌కల్, జూన్ 2: మండలంలోని బసంతపూర్, మెటల్‌కుంట, గంగ్వార్ గ్రామాల్లో సాగవుతున్న చెరుకు పంటకు ఆశించిన వేరు కాండం తొలిచే పురుగుల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని మండలంలోని బసంతపూర్ ప్రొఫెసర్ జయశంకర్‌సార్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, చెరుకు అభివృద్ధి విభాగం రాష్ట్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం అయా గ్రామాల్లో వేరు కాండం తొలిచే పురుగుతో దెబ్బతిన్న చెరుకు తోటలను పరిశీలించారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వేరుకాండం తొలిచే పురుగుల భారీ నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. సాగులో ఏమైనా సమస్యలుంటే బసంతపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని రావాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, చెరుకు ఫ్యాక్టరీ అధికారులు రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లండి


ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో శంకర్

కల్హేర్, జూన్ 2: విద్యార్థులకు పంపిణీ చేయడానికి పాఠ్యా పుస్తకాలు ఎమ్మార్సీ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వచ్చి తీసుకువెళ్లాలని ఎంఈవో శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదు ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత, 22 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1,510 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. మొదటి విడతలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 5,895 పాఠ్యాపుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలని సూచించారు.

## ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయాలి

న్యాల్‌కల్, జూన్ 2: నల్లాల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ డీడీఎం కృష్ణతేజ కోరారు. గురువారం మండలంలోని హుసెల్లి, వడ్డి గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. మహిళల ఇబ్బందులను తొలిగించేందుకు కచ్చితంగా ప్రతీ ఇంటి ఆవరణలో పైపులు, నల్లాలను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. భగీరథ పనులు వందశాతం పూర్తి చేయాలన్నారు. ఆయనవెంట డీఈఈ సాబేర్ హుస్సేన్, తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగాభవాని, రైతులు

గుమ్మడిదల, జూన్ 2: ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ గంగాభవానీ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో పీఏసీఎస్ ధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో టన్నుల కొద్దీ ధాన్యం ఉండడంతో లారీల ద్వారా రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. స్థానిక రైస్‌మిల్లర్లు సరిగా ధాన్యం తీసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇక నుంచి నారాయణఖేడ్ రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని ఆమె సూచించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఈవో నిఖిత ఉన్నారు.